క్లుప్తంగా

సోమేశ్వరునికి సువర్ణ నేత్రాల సమర్పణ



సోమేశ్వర స్వామికి సువర్ణ నేత్రాలు సమర్పిస్తున్న సత్తిబాబు కుటుంబ సభ్యులు

రాయవరం: మండలంలోని సోమేశ్వరంలో కొలువైన బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వర స్వామివారికి గ్రామానికి చెందిన భక్తుడు శుక్రవారం సువర్ణ నేత్రాలు సమర్పించారు. గ్రామానికి చెందిన బొమ్మిరెడ్డి సత్తిబాబు, నాగ సునీత దంపతులు తమ కుమారుడు భరత్ వివేక్ మొక్కులో భాగంగా స్వామి వారికి సువర్ణ నేత్రాలు, కనుబొమ్మలను సమర్పించారు. కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని రూ.1.60 లక్షల విలువైన బంగారు నేత్రాలు, కనుబొమ్మలను దాత ఆలయ ప్రధానార్చకుడు పరిటాల సుబ్రహ్మణ్య శర్మకు అందజేశారు. సుబ్రహ్మణ్యశర్మ వాటికి సంప్రోక్షణ పూజలు చేశారు. కార్యక్రమంలో కాపు సంఘం మండలశాఖ అధ్యక్షుడు నున్న వెంకటరమణ, సత్తిబాబు కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

క్షేత్ర స్థాయిలో క్యాన్సర్ పరీక్షలు



వడ్లమూరులో అవగాహన కల్పిస్తున్న ఎంపీహెచ్ఈఓ గోపాలకృష్ణ

కపిలేశ్వరపురం: అచ్యుతాపురం పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ కె.విజయదీపిక ఆధ్వర్యంలో సిబ్బంది క్షేత్రస్థాయిలో అందరికీ క్యాన్సర్ పరీక్షలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్ళి క్యాన్సర్ లక్షణాల ఆధారంగా పరీక్షించారు. వడ్లమూరు, నిడసనమెట్ట గ్రామాల్లో ఎంపీహెచ్ఈఓ సీహెచ్ గోపాలకృష్ణ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి కారకాలు, లక్షణాలపై అవగాహన కల్పించారు. లక్షణాలున్నవారి వివరాలను వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్తామన్నారు. వివిధ దశల్లో పరీక్షించిన అనంతరం అవసరాన్ని బట్టి చికిత్స అందించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంఎల్హెచ్పీ వరలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు విజయదుర్గ, ఆశ కార్యకర్తలు నాగలక్ష్మి, మీరమ్మ సేవలు అందించారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి



కోట గ్రామంలోని రెవెన్యూ గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీపీ

కె.గంగవరం: గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ గ్రామ సభలను రైతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలంలోని కోట, కోటిపల్లి గ్రామంల్లో జరుగుతున్న గ్రామ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. గతంలో జరిగిన రీ సర్వేలో రైతులకు ఎటువంటి సమస్యలు వచ్చిన ఈ గ్రామ సభల్లో రాతపూర్వకంగా ఫిర్యాదు అందిస్తే రెవెన్యూ అధికారులు సంబంధిత సమస్యను పరిష్కరిస్తారన్నారు. చాలా వరకు రీసర్వేలో భూ సమస్యలను పరిష్కారం అయ్యాయని ఇంకా గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలో ఈ రెవెన్యూ సదస్సులు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు. సర్పంచ్‌లు పెమ్మాడి బేబి, వెంకట్రావు, ఆర్ఐ వెంకట్రావు, సర్వేయర్ పావని రెవెన్యూ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రారంభమైన పంటు ప్రయాణం



పంటు ప్రయాణం పునరుద్ధరించడంతో జరుగుతున్న రాకపోకలు

కె.గంగవరం: గత మూడు నెలలుగా నిచిపోయిన కోటిపల్లి–ముక్తేశ్వరం మధ్య పంటు ప్రయాణం తిరిగి శుక్రవారం నుంచి ప్రారంభమయిందని ఫెర్రీ జాయింట్ కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. గత మూడు నెలలుగా పంటు ప్రయాణం నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఇటీవల గోదావరికి వచ్చిన వరదల నేపథ్యంలో రేవులో ఇసుక మేట అధికంగా వేయడంతో పాటు ముక్తేశ్వరం వైపు గల నడక దారి కొట్టుకుపోవడంతో పంటు ప్రయాణం నిలిచిపోయిందని వారు పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన అమలాపురం వెళ్లడానికి, కూలీలు గోదావరి అటువైపుకు వెళ్లడానికి యానం మీదుగా సుమారు 60 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేదని ఇయితే పంటు ప్రయాణం తిరిగి ప్రారంభం కావడంతో ప్రయాణ భారం తగ్గుతుందని వారు చెప్పారు.

భారంగా పశుపోషణ

- వేధిస్తున్న ఎండుగడ్డి కొరత
- పెరిగిన దాణా ధరలు
- రైతుల ఆందోళన



కాజులూరులో పొలాల్లో మేస్తున్న పశువులు

కాజులూరు: 'పల్లెల్లో పాడిపంటలు' అనే పదానికి కాలం చెల్లిపోతోంది. ఒకప్పుడు గ్రామాల్లో గుంపులు, గుంపులుగా సంచరించే పాడి పశువులు నేడు రైతుల ఇంట ఒకటి, రెండు నామమాత్రంగానే కనిపిస్తున్నాయి. పెరిగిన దాణా ఖర్చులు, వ్యాధుల భయం, కొరవడిన ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతులకు పాడి పోషణ భారంగా మారింది. పశుగ్రాసం కొరత, పెరుగుతున్న దాణా ధరలకు తోడు పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రేయింబవళ్లు కష్టపడి పాడి పశువులును పోషిస్తే వచ్చే పాల దిగుబడి రోజుకూలీ కూడా సరిపడని దయనీయ పరిస్థితి నెలకొంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటిని పోషించలేక కబేళాలకు తరలించాల్సిన దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని పలువురు రైతులు అంటున్నారు. ఇటీవల సాగు చేస్తున్న పంటలు వరుసగా నష్టాలపాలవుతున్నాయని ఈ తరుణంలో పాడి పశువుల ద్వారా కాస్త ఆదాయం వస్తుందనుకుంటే పాడి పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోతుందని రైతులు దిగులు చెందుతున్నారు.

పెరుగుతున్న దాణా, పశుగ్రాసం ధరలు

ప్రస్తుత పరిస్థితుల్లో వరి పంటను యంత్రాల ద్వారా కోత కోయించడంతో ఎండుగడ్డి పనికి రాకుండా పోయి పశుగ్రాసం కొరత తీవ్రంగా మారింది. డెల్టా ప్రాంతంలో పశుపోషణకు ఎండు గడ్డే ఆధారం. ఈ నేపథ్యంలో ఒక ట్రాక్టర్ ఎండు గడ్డి ధర సుమారు రూ.ఐదు వేల నుంచి రూ.ఆరు వేల వరకు పలుకుతోంది. పాడి పశువులకు అందించే గడ్డితో పాటు దాణా ఉలవపొట్టు, తవుడు ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పశుపోషణ రైతులకు భారంగా మారింది. తవుడు బస్తా ధర ఏకంగా రూ.2200 పలుకుతోంది. పశుగ్రాసం, దాణా తదితర ఖర్చులు రెట్టింపు కావడంతో పాడి పెంపకంతో రైతుల్లో ఆసక్తి సన్నగిల్లుతోంది. ఈ నేపథ్యంలో గేదెలను మేపడం వీలుకాక చాలా మంది రైతులు ఒకటి రెండు గేదెలతోనే సరిపెట్టుకుని మిగిలిన వాటిని అమ్మేస్తున్నారు. ఒక గేదె పోషణకు అయ్యే ఖర్చు పాల దిగుబడి కంటే అధికమవుతుందని వారంటున్నారు.

గిట్టుబాటు కాని పాల ధర

మండలంలో ప్రధానంగా గొల్లపాలెం, కాజులూరు, ఆర్యావటం, కోలంక, కుయ్యేరు, జగన్నాథగిరి, పెనుమళ్ల, మొగలిపాలెం తదితర గ్రామాల్లో వందలాది మంది రైతులు పాడి పశువుల పెంపకంపైనే వారి కుటుంబాలు పోషించుకుంటున్నారు. పశుపోషణకు ప్రభుత్వం ఏ రకంగానూ సహాయం చేయకపోవడంతో గత్యంతరం లేని స్థితిలో ఉన్న పశువులను అమ్ముకోవలసి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాల డెయిరీలో పది పాయింట్లు వెన్న శాతం చూపిస్తేనే లీటరుకు రూ.60 ధర చెల్లిస్తున్నారు. వెన్న శాతం తక్కువగా ఉన్న పాలకు రూ.35 నుంచి రూ.40 మించి చెల్లించడం లేదు. పశువుల పోషణ, మేత ఖర్చులకు వచ్చే రాబడి ఏ మాత్రం సరిపోకపోవడంతో రైతులు పశువులను కొనాలంటే బెంబేలెత్తిపోతున్నారు.

పాలకు గిట్టుబాటు ధర కల్పించాలి



బయట మార్కెట్లో పాలకు ధర ఉన్నప్పటికీ రైతులకు మాత్రం గిట్టుబాటు ధర దక్కటం లేదు. పాలు పలుచగా ఉన్నాయని వెన్న శాతం తక్కువగా ఉందని డైరీ వ్యాపారులు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. పెరుగుతున్న దాణా ఖర్చులకు అనుగుణంగా ధర కల్పించాలి.

– కొవ్వూరి రామారెడ్డి, రైతు గొల్లపాలెం

ప్రభుత్వం సబ్సిడీపై దాణా సమకూర్చాలి



గ్రామాలలో పశువైద్య సేవలను మెరుగుపరచి పశువులకు ఎప్పటికప్పుడు వైద్యసేవలు అందించటంతోపాటు ప్రభుత్వం చిట్టు, తవుడు తదితర దాణాలను రైతులకు సబ్సిడీపై అందించాలి. పాల దిగుబడి పెరిగేందుకు పశువులకు పౌష్టికాహారాన్ని సమకూర్చాలి.

– పితాని సత్యనారాయణ, రైతు శలపాక

శెట్టిబలిజ వన సమారాధన కరపత్రాల ఆవిష్కరణ



వెంకటాయపాలెంలో కరపత్రం ఆవిష్కరిస్తున్న శెట్టిబలిజ పెద్దలు, నాయకులు

రామచంద్రపురం రూరల్: ఈ నెల 23న నిర్వహించనున్న రామచంద్రపురం నియోజకవర్గ శెట్టిబలిజ కార్తిక వన సమారాధన పోస్టర్ శుక్రవారం ఆవిష్కరించారు. కన్వీనర్లు కట్టా సూర్యనారాయణ, నరాల ఏడుకొండలు ఆధ్వర్యంలో వెంకటాయపాలెం పిల్లి అప్పారావు బీసీ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా నియోజకవర్గ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్తిక వన సమారాధన కార్యక్రమం విజయవంతం చేయడానికి శెట్టిబలిజ సంఘ పెద్దలు, యువత, ప్రజా ప్రతినిధులు, నాయకులు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, మాజీ మంత్రి, తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణలను కలసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మూడు మండలాల సంఘ పెద్దలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో రైతులకు అండగా నిలవాలి



ద్రాక్షారామ రైతు సేవా కేంద్రంలో ధాన్యం శాంపిల్ తీసే విధానం పరిశీలిస్తున్న జేసీ నిషాంతి

రామచంద్రపురం రూరల్: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే విషయంలో అడుగడుగునా రైతులకు అండగా నిలవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి వ్యవసాయ అధికారులు, ధాన్యం కొనుగోలు సిబ్బందికి సూచించారు. రామచంద్రపురం మండలంలోని ద్రాక్షారామ రైతు సేవా కేంద్రాన్ని ఆమె శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే విధానం, శాంపిల్ తీసే విధానంలలో సిబ్బంది పనితీరును స్వయంగా పరిశీలించారు. స్థానిక రైతులను అడిగి వ్యవసాయ అధికారులు, ధాన్యం కొనుగోలు సిబ్బంది సహకారం ఎలా ఉంది అని తెలుసుకున్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం ఆర్డీఓ దేవరకొండ అఖిల, మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్, ద్రాక్షారామ పీఏసీఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పెంకే సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు సీహెచ్ రాజ్‌కుమార్, ఆర్.హేమంత్‌కుమార్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలని 108 ఉద్యోగుల వినతి



తహసీల్దార్ తేజేశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న 108 ఉద్యోగులు

మండపేట: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 108 వాహనాల్లో పని చేసే ఉద్యోగులు స్థానిక తహసీల్దార్ తేజేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. 108 ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి 108 ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ప్రభుత్వానికి తమ గోడు వినిపించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా 108 ఉద్యోగులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ ఈనెల 11న అరబిందో ఫార్మసీకి, ప్రభుత్వానికి, రాష్ట్ర కార్మిక శాఖాధికారికి సమ్మె నోటీసు పంపిందన్నారు. ఈ నెల 25 లోగా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించని పక్షంలో ప్రత్యక్ష సమ్మెకు దిగుతామని రాష్ట్ర కమిటీ పిలుపు ఇచ్చిందన్నారు ప్రభుత్వ ఆధీనంలో 108 సేవలను నడిపించాలని కోరారు. వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. అరబిందో ఫార్మసీ నాలుగేళ్లుగా బకాయిపడిన రాయితీలు, వేతనాలు, ఈఎల్ మొత్తాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 12 గంటల పని విధానం నడుస్తోందని, దానిని 8 గంటలకు క్రమబద్ధీకరించాలని కోరారు.

గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన



మండపేట పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు



కపిలేశ్వరపురం గ్రంథాలయంలో పుస్తక ప్రాధాన్యతను వివరిస్తున్న సతీష్



ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో పుస్తకాలను ఆసక్తిగా పరిశీలిస్తున్న విద్యార్థులు

మండపేట: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఏడిద రోడ్డులోని మున్సిపల్ కార్యాలయ భవనంలోనూ, కేపీరోడ్డు గ్రంథాలయంలోనూ పలు రకాల పుస్తకాలను ప్రదర్శనగా ఉంచారు. దిన, పక్ష, వార మాస పత్రికలతో పాటు, పిల్లలు చదువుకునే నీతి కథల పుస్తకాలు, ఆధ్యాత్మిక, జనరల్ నాలెడ్జ్, నవలలు, ఆరోగ్య సూత్రాలు, సైన్స్, వేద గణాంక పుస్తకాలు, శాస్త్రవేత్తలు, స్వాతంత్ర్య సమరయోధులు జీవిత గాథలను తెలియజేసే పుస్తకాలను ప్రదర్శించినట్టు గ్రంథాలయ అధికారి ఎస్. పూర్ణమ్మ తెలిపారు. విద్యార్థులకు వాటన్నింటినీ చూపించి పుస్తకాలు చదవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

గ్రంథ పఠనంతోనే విలువలు

కపిలేశ్వరపురం: గ్రంథ పఠనంతో మానవ విలువలను కలిగి ఉండగలుగుతారని గ్రంథాలయ వారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి దానేటి శివకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. వివిధ సామాజిక అంశాలు, మహనీయుల చరిత్రలు, ఆరోగ్యం, సాంకేతికత తదితర రంగాలకు చెందిన పుస్తకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ సతీష్, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

రామచంద్రపురం రూరల్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని సీహెచ్ రత్న పద్మావతి ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తక ప్రదర్శన కార్యక్రమం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సాంకేతికత ఎంత అభివృద్ధి చెంది కంప్యూటర్లు, సెల్‌ఫోన్‌లు వచ్చినా పుస్తక పఠనానికి సాటి రావన్నారు. పుస్తక పఠనంతో విద్యార్థుల్లో మానసిక వికాసం కలుగుతుందని జ్ఞానవంతులు అవుతారని వివరించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయుడు డి.సత్యనారాయణ, గ్రంథాలయ అధికారి ములంపాక వీర సూరిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన సప్తాహ మహోత్సవాలు

కాజులూరు: మండలంలోని ఆర్యావటంలో గత వారం రోజులుగా జరుగుతున్న సప్తాహ మహోత్సవాలు ఘనంగా ముగిసాయి. స్థానిక భక్త కమిటీ సభ్యులు ఈ నెల ఐదో తేదీ బుధవారం ఉదయం స్థానిక రామాలయంలో కలశ స్థాపన చేసి కార్యక్రమాలు ప్రారంభించారు. నాటి నుంచి నిర్విరామంగా భజన కార్యక్రమాలు కొనసాగించటంతో పాటు ప్రతి రోజూ రాత్రి ఆవునెయ్యితో జ్యోతిర్లింగార్చనలు, కుంకుమపూజలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. చివరిగా పూర్ణాహుతితో సప్తాహ మహోత్సవాలు ముగింపు పలికిన నిర్వాహక కమిటీ సభ్యులు పలువురి స్థానిక దాతల సహకారంతో ఆలయం వద్ద భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు.

కార్తికం.. కమనీయం



సోమేశ్వరంలో దీపాలంకరణ చేస్తున్న భక్తులు



ప్రత్యేకాలంకరణలో సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి



విశేష అలంకరణలో అంగర సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



మండపేటలో బాలాత్రిపుర సుందరీదేవి

దీప శోభతో అలరారిన శివాలయాలు

రాయవరం: కార్తిక పౌర్ణమి కావడంతో మండలంలోని శివాలయాలు శుక్రవారం దీప శోభతో అలరారాయి. ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. వాడవాడలా భక్తులు కార్తిక పౌర్ణమి పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేకువజాము నుంచి ఉపవాసం పాటించారు. మహిళలు రాత్రి ఆలయంలో కార్తిక దీపాలు వెలిగించడంతో ఆలయాలు దీపశోభను సంతరించుకున్నాయి. మహిళలు బియ్యం, కూరగాయలు, కంద పిలకలు తదితరాలను అర్చకులకు స్వయం పాకంగా అందజేశారు. రాత్రి శివాలయాల వద్ద జ్వాలా తోరణాలు వెలిగించారు. ప్రత్యేక దీపాలంకరణలు కనువిందు చేశాయి. చారిత్రక శివాలయాలైన సోమేశ్వరం, వెంటూరులోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి, ఉమా సమేత సోమేశ్వరస్వామి, అలాగే రాయవరంలోని పార్వతీ సమేత రాజేశ్వరస్వామి, చెల్లూరులోని బాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి, పసలపూడిలోని రాజేశ్వరస్వామితో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని శైవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో..

కపిలేశ్వరపురం: మండలంలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కార్తిక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో స్వామిని విశేషంగా అలంకరించారు. గ్రామంతో పాటు పడమరఖండ్రిక గ్రామానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

బాలాత్రిపుర సుందరీదేవి దివ్య దర్శనం

మండపేట: కార్తిక పౌర్ణమి కావడంతో శుక్రవారం పట్టణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కేపీ రోడ్డులోని జనార్దనస్వామి వారి ఆలయంలోని బాలాత్రిపురసుందరీదేవి విశేష పూజలు అందుకున్నారు. భక్తులు కార్తిక పౌర్ణమి నోములు నోసి, ఉపవాస దీక్షలు ఆచరించారు. స్థానిక కలువపువ్వు సెంటర్లోని వేంకటేశ్వరస్వామి ఆలయం, ఏడిద సంఘమేశ్వరస్వామి ఆలయం, బురుగుంత చెరువు సీతారామ క్షేత్రాలను భక్తులు సందర్శించి పూజలు నిర్వహించారు. రథం ఆలయంలో శుక్రవారం రాత్రి జ్వాల తోరణం ఉత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి జ్వాలాతోరణం తిలకించారు. ధ్వజ స్తంభం దీపాలు వెలిగించారు.

భీమేశ్వరాలయంలో కార్తిక పౌర్ణమి పూజలు



సప్త గోదావరిలో కార్తిక దీపాలు వదులుతున్న భక్తులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామలో మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి ఆలయంలో వేలాది భక్తులు శుక్రవారం కార్తిక పౌర్ణమి పూజలు నిర్వహించుకున్నారు. తెల్లవారుజాము నుంచి ఆలయానికి తరలి వచ్చి ఆలయ ప్రాంగణంలోని సప్తగోదావరిలో దీపాలు వదిలి కార్తిక దామోదరుడిని పూజించారు. అనంతరం భీమేశ్వరస్వామివారిని దర్శించుకుని అభిషేకాలు నిర్వహించుకున్నారు. మాణిక్యాంబా అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించుకున్నారు. కార్తిక పౌర్ణమి పురస్కరించుకుని నవ వధువులు పువ్వులు, పిందెలు సమర్పించుకున్నారు. కార్తిక పౌర్ణమి నోముల దీక్ష చేపట్టిన మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపారాధనలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించుకుని, పున్నమి చంద్రుడిని దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది భక్తులకు సేవలందించారు. ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కాజులూరులో..

కాజులూరు: మండల గ్రామాల్లో శుక్రవారం భక్తులు కార్తిక పౌర్ణమి కార్యక్రమాలను ఘనంగా జరుపుకొన్నారు. తెల్లవారుజాము నుంచే స్వామికి భక్తుల అభిషేకాలతో శివాలయాలు కిటకిటలాడాయి. మండలంలో గొల్లపాలెం, కాజులూరు, శీల, దుగ్గుదూరు, కుయ్యేరు, అయితపూడి తదిర గ్రామాల్లోని పలు శివాలయాల్లో సోమవారం రాత్రి జోతిర్లింగార్చన చేపట్టి జ్వాలాతోరణం నిర్వహించారు. ఆలయంలోని రావి చెట్టుకు వరిగడ్డిని వెంటు చుట్టి నిప్పు ముట్టించారు. స్వామి వారిని పల్లకీలో ఉంచి రావిచెట్టు చుట్టూ ప్రదక్షిణలు జరిపారు. అనంతరం రావిచెట్టుకు వెలుగు తున్న జ్వాలాతోరణం గడ్డిని భక్తులు పోటీ పడి తీసుకున్నారు. ఈ గడ్డిని పశువులకు మేతలో కలిపి మేపితే ఆరోగ్యంగా ఉండి పాల దిగుబడి పెరుగుతుందని రైతుల విశ్వసిస్తారని అర్చకులు తెలిపారు. కార్యక్రమాల్లో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలోని సప్త గోదావరికి హారతి



కోలంకలో జ్వాలాతోరణం మధ్య నుంచి స్వామిని పల్లకీలో తీసుకువస్తున్న దృశ్యం

పీఠంలో కోటి కార్తిక కాంతులు



విజయదుర్గ అమ్మవారికి విశేష పూజలు

రాయవరం: గుడి గంటలు..మంత్రోచ్ఛరణలు..అభిషేకాలు..దీపారాధనలతో వెదురుపాక విజయ దుర్గా పీఠం శుక్రవారం అలరారింది. కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం(గాడ్) నేతృత్వంలో వైభవంగా కోటి దీపార్చన నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పోటెత్తడంతో పీఠం కిటకిటలాడింది. విజయదుర్గా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పీఠంపై అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి లక్ష కుంకుమ పూజ, విజయవెంకటేశ్వర స్వామి వారికి సుప్రభాతసేవ, తులసిదళ అర్చనలు, భవానీశంకర అష్టమ లింగేశ్వరస్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు.మహిళలు అధిక సంఖ్యలో పీఠానికి వచ్చి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) ఆశీస్సులు పొందారు. పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరి, సత్యకనకదుర్గ, ఆధ్వర్యంలో ఘనంగా భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.